


మొవ్వ మండలం అవిరిపూడిలో నీటమునిగిన పొలాలు

ఓవైపు భారీ వర్షాలు జిల్లాను అతలాకుతలం చేస్తుంటే, మరోవైపు మునిగిపోతున్న పంటపొలాలు అన్నదాతలను ఆక్రందనకు గురిచేస్తున్నాయి. అప్రమత్తమైన అధికార యంత్రాంగం కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటుచేసింది. ప్రత్యేక బృందాలు క్షేత్రస్థాయిలో సమీక్షిస్తున్నాయి.

ముంచేసిన వాన

భారీ వర్షాలతో నీట మునిగిన వరిపైరు | పొంగిపొర్లుతున్న డ్రెయిన్లు, కాల్వలు

- కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు
- వరద పరిస్థితులపై సమీక్షకు ప్రత్యేక బృందాలు
- అప్రమత్తంగా ఉండాలి : అధికారులకు కలెక్టర్ ఆదేశాలు
- బంటుమిల్లి మండలంలో గోడకూలి వృద్ధురాలు మృతి
- నేడు కూడా జిల్లావ్యాప్తంగా వర్షాలు


బందరులో డీఈవో కార్యాలయానికి వెళ్లే రోడ్డులో నిలిచిన వర్షపు నీరు

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : జిల్లాను వర్షం వీడట్లేదు. శుక్రవారం రాత్రి నుంచి శనివారం ఉదయం వరకు జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీవర్షం కురిసింది. కంకిపాడులో అత్యధికంగా 58.6 మిల్లీమీటర్లు, నాగాయలంకలో అత్యల్పంగా 8.6 మిల్లీమీటర్లు నమోదు కాగా, జిల్లా సగటు వర్షపాతం 37.7 మిల్లీమీటర్లుగా ఉంది. ఆదివారం కూడా కోస్తాతీరం వెంబడి భారీ వర్షం కురుస్తుందని వాతావరణ శాఖ హెచ్చరించింది. వర్షాల కారణంగా గుడివాడ, తోట్లవల్లూరు, మచిలీపట్నం, పెడన, ఘంటసాల, బంటుమిల్లి, కృత్తివెన్ను తదితర మండలాల్లోని వరిపైరు నీటమునిగింది. కొన్ని ప్రాంతాల్లో నీటమునిగే దశకు చేరుకున్న వరిపైరు ప్రమాదకర పరిస్థితికి చేరింది. గుండేరు, శివగంగ, ఉప్పుకాలువ, రత్నకోడు, ఉప్పుటేరు, లజ్జబండ, వడ్లమన్నాడు డ్రెయిన్లు పొంగి ప్రవహిస్తున్నాయి.

గోడ కూలి వృద్ధురాలు మృతి

బంటుమిల్లి : వర్షాలకు ఇంటిగోడ కూలి ఓ మహిళ మృతిచెందింది. బంటుమిల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మల్లంపూడి గ్రామానికి చెందిన కరి దానమ్మ (60) శుక్రవారం రాత్రి ఇంట్లో నిద్రిస్తుండగా, మట్టి గోడ కూలింది. ఈ ఘటనలో ఆమె అక్కడికక్కడే మృతిచెందింది. దానమ్మకు ఐదుగురు సంతానమైనా, అందరూ వేర్వేరుగా ఉంటున్నారు. ఆమె కుమారుడు కరి వెంకటేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బంటుమిల్లి ఎస్సై జి.వాసు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



అధికారులకు కలెక్టర్ బాలాజీ ఆదేశాలు

వర్షాలు తగ్గుముఖం పట్టే వరకు అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ డీకే బాలాజీ శనివారం ఆదేశాలు జారీ చేశారు. కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు సమాచారం సేకరిస్తున్నారు. జేసీ, నీటిపారుదల శాఖ ఎస్ఈ, వ్యవసాయ శాఖ జేడీతో జిల్లాస్థాయిలో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. డివిజన్ స్థాయిలో ఆర్డీవోలు, నీటిపారుదల శాఖ డీఈలు, వ్యవసాయ శాఖ ఏడీలతో ప్రత్యేక బృందాలు ఏర్పాటుచేసినట్లు కలెక్టర్ తెలిపారు. వర్షం తగ్గుముఖం పట్టాక పంటనష్టం అంచనాలు తయారుచేసి, నివేదికలు సిద్ధం చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కాగా, వర్షాల కారణంగా ముంపుబారిన పడిన వరిపైరు, నారుమడులను కాపాడుకునేందుకు రైతులు యాజమాన్య పద్ధతులను పాటించాలని వ్యవసాయ శాఖ జేడీ పద్మావతి తెలిపారు.

ఎవరెవరు..?

నాడు పోలీస్ శాఖలో వైసీపీకి వీరవిధేయులు

ఐదేళ్ల వైసీపీ పాలనలో రెండు జిల్లాల పరిధిలోని పోలీసులు ప్రజాసేవను విస్మరించారు.. వైసీపీ సేవలో తరించారు.. ఆ పార్టీ కార్యకర్తలుగా పనిచేశారు.. టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఎన్ని ఫిర్యాదులు చేసినా బుట్టదాఖలు చేశారు.. ఎదుటి వారిపైనే కేసులు పెట్టి జైళ్లకు పంపారు.. గన్నవరం, మచిలీపట్నం, గుడివాడ నియోజకవర్గాల్లోని పోలీసులు అరాచకంగా ప్రవర్తించారు. మాజీ ఎమ్మెల్యేలు వల్లభనేని వంశీ, కొడాలి నాని, పేర్ని నాని సేవలో మునిగితేలారు. ప్రస్తుతం అధికారం మారింది.. అప్పుడు వైసీపీ జెండాలు మోసిన సీఐలంతా నేడు టీడీపీ ప్రజాప్రతినిధుల పంచన చేరుతున్నారు. మంచి పోస్టింగ్‌ల కోసం వారు చేస్తున్న ప్రయత్నాలను కొందరు టీడీపీ ప్రజాప్రతినిధులు ఆమోదముద్ర వేయడాన్ని సామాన్య కార్యకర్తలు జీర్ణించుకోలేక పోతున్నారు. ఐదేళ్లూ తమను హింసించిన వారిని నాయకులు భుజాలకెత్తుకోవడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. నేడో రేపో రెండు జిల్లాల్లో సీఐల బదిలీలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో వైసీపీ ఖాకీల పైరవీలు మరింత జోరందుకున్నాయి.

- విజయవాడ, ఆంధ్రజ్యోతి

- నేడు బదిలీల కోసం టీడీపీ ప్రజాప్రతినిధుల చెంతకు.. • రెండు జిల్లాల్లో మొదలైన పైరవీలు
- సానుకూలంగా స్పందిస్తున్న కొందరు ఎమ్మెల్యేలు
- వైసీపీతో అంటకాగిన వారిని ప్రోత్సహించొద్దని టీడీపీ నాయకులు, కార్యకర్తల హితవు
- సీఐల బదిలీల్లో కొనసాగుతున్న ఉత్కంఠ



కృష్ణాజిల్లాలో ఇదీ పరిస్థితి

- గన్నవరం నియోజకవర్గంలో పనిచేసిన సీఐలు మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీకి అడుగులకు మడుగులొత్తారు. గన్నవరం సీఐగా పనిచేసిన కనకారావును టీడీపీ నాయకులు, కార్యకర్తలు.. వైసీపీ నాయకుడిగా భావిస్తుంటారు. స్థానిక టీడీపీ కార్యాలయంపై దాడి సమయంలో ఈయన దగ్గరుండి మరీ వైసీపీ మూకలను ప్రోత్సహించారన్న ఆరోపణలు ఉన్నాయి. వైసీపీ మూకల రాళ్ల దాడిలో కనకారావుకు దెబ్బ తగిలింది. ఎవరు దాడి చేశారన్న విషయంలో స్పష్టత ఉన్నా ఆయన మాత్రం టీడీపీ నాయకులపై హత్యాయత్నం కేసు పెట్టేశారు. తెలుగు మహిళా నాయకురాలు ముల్పూరి సాయి కల్యాణిని ఆమె బెడ్‌రూంలోకి వెళ్లి మరీ అరెస్టు చేసి తీసుకెళ్లారు. ఈయన ప్రస్తుతం గన్నవరం విమానాశ్రయంలో ఇమ్మిగ్రేషన్ సీఐగా విధులు నిర్వహిస్తున్నారు. మంచి పోస్టింగ్ కోసం పైరవీలు చేసుకుంటున్నారు.
- హనుమాన్ జంక్షన్ సీఐగా పనిచేస్తున్న నరసింహమూర్తి వంశీకి అనుంగు అనుచరుడన్న ముద్ర ఉంది. లోకేశ్ యువగళం పాదయాత్ర సమయంలో రంగన్నగూడెంలో టీడీపీ, వైసీపీ కార్యకర్తల మధ్య ఫ్లెక్సీకి సంబంధించి గొడవ తలెత్తింది. ఈ ఘటనపై టీడీపీ నాయకులు దేవినేని ఉమా, కొల్లు రవీంద్ర, కొనకళ్ల నారాయణ పోలీసుస్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసినా కేసు నమోదు చేయలేదు. వారు పోలీసుస్టేషన్‌లో ఉన్న సమాచారాన్ని వంశీకి చేరవేయడంతో ఆయన ఆగమేఘాలపై వచ్చి టీడీపీ వారిపై తన అనుచరులతో ఎదురు కేసు పెట్టించారు. గన్నవరంలో టీడీపీ కార్యాలయంపై దాడి అనంతరం గన్నవరం ఇన్‌చార్జి సీఐగానూ నరసింహమూర్తి చేశారు. ఆ సమయంలో టీడీపీ నాయకుడు పట్టాభిని అరెస్టు చేయడంలో అత్యుత్సాహం చూపారు. ఈయన ప్రస్తుత బదిలీల్లో నందిగామ నియోజకవర్గంలోని కంచికచర్ల సీఐగా వెళ్లేందుకు పెద్ద ఎత్తున ప్రయత్నాలు చేస్తున్నారు. స్థానిక టీడీపీ నాయకులను ఆశ్రయించి తనను కంచికచర్ల సీఐగా బదిలీ చేయించాలని కోరుతున్నారు.
- మచిలీపట్నం నియోజకవర్గ పరిధిలో ఐదు పోలీసుస్టేషన్లు ఉండగా, ఐదుగురు సీఐలు విధులు నిర్వహిస్తుంటారు. వీరంతా ఎన్నికల సమయంలో పేర్ని నాని ఏరికోరి తెచ్చుకున్న వీరభక్తులు. టీడీపీ అధికారంలోకి వచ్చాక కూడా వీరు తమ విధేయతను మార్చుకునే ప్రయత్నం చేయలేదు. దీంతో తప్పని పరిస్థితుల్లో ఆర్‌పేట సీఐగా ఉన్న శ్రీనివాసయాదవ్‌ను తక్షణం ఆ స్థానం నుంచి తొలగించాలని మంత్రి కొల్లు రవీంద్ర కోరడంతో అప్పటి ఎస్పీ ఆయన్ను తప్పించారు. ఇక్కడ పనిచేస్తున్న మిగిలిన వారు తమకూ ఎలాగూ బదిలీ తప్పదని భావించి జిల్లాలోని కీలక స్థానాలకు పైరవీలు చేసుకుంటున్నారు.
- గుడివాడ నియోజకవర్గ పరిధిలోని ముగ్గురు సీఐలకు కొడాలి నాని వీరవిధేయులుగా పేరు. వీరందరినీ సాగనంపేందుకు స్థానిక ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పట్టుగా ఉన్నారు. కానీ, గతంలో ఇక్కడ పనిచేసిన ఎస్ఎల్ సోమేశ్వరరావు, రామకృష్ణను మళ్లీ గుడివాడ తీసుకొచ్చేందుకు సిద్ధమవుతుండటాన్ని కార్యకర్తలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. వీరు గుడివాడలో పనిచేసిన సమయంలో కొడాలి నాని ఆడమన్నట్లు ఆడేవారు. అలాంటి వారిని మళ్లీ గుడివాడ ఎలా తీసుకొస్తారని ప్రశ్నిస్తున్నారు.

ఎన్టీఆర్ జిల్లా కమిషనరేట్‌లో ఇలా..

విజయవాడ నగరంలో కూడా వైసీపీ విధేయులుగా ముద్రపడిన వారంతా ఇప్పుడు కీలక స్థానాల కోసం పోటీ పడుతున్నారు. గతంలో నగరంలో పనిచేసిన సహేరా బేగం (ప్రస్తుతం దిశ పీఎస్‌లో ఉన్నారు), కాశీ విశ్వనాథం (ఎస్‌బీలో అడ్మిన్ సీఐగా ఉన్నారు), షరీఫ్ (కృష్ణలంక క్రైం సీఐగా ఉన్నారు) వీరు ముగ్గురూ గత వైసీపీ ప్రభుత్వంలో కీలక స్థానాల్లో విధులు నిర్వహించినవారే. తిరిగి మళ్లీ భవానీపురం, కృష్ణలంక, గవర్నర్‌పేట పోలీసుస్టేషన్లలో పోస్టింగ్‌ల కోసం ప్రయత్నాలు చేసుకుంటున్నారు.

- ప్రస్తుతం ఇబ్రహీంపట్నంలో విధులు నిర్వహిస్తున్న ముత్యాల సత్యనారాయణ వైసీపీ వీరవిధేయుడు. ఈయన్ను మళ్లీ గవర్నర్‌పేటకు తీసుకొచ్చేందుకు టీడీపీ నేతలే ప్రయత్నిస్తున్నారు.
- ఎన్నికల ముందు వరకు ఇబ్రహీంపట్నంలో సీఐగా చేసిన పలివెల శ్రీను ప్రస్తుతం సైబర్ క్రైంలో విధులు నిర్వహిస్తున్నారు. మళ్లీ ఇబ్రహీంపట్నంలో పోస్టింగ్ కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. ఐదేళ్లూ వైసీపీ నాయకులతో అంటకాగిన సీఐల విషయంలో ఆచీతూచి వ్యవహరించాలని, అలాంటి వారిని ప్రోత్సహించవద్దని టీడీపీ కార్యకర్తలు ఎమ్మెల్యేలకు మొరపెట్టుకుంటున్నారు.

నువ్వెక్కడి కంటే నువ్వెక్కడికి..? నాకు అక్కడ కావాలంటే.. నాకు ఇంకోచోట కావాలి...? ఇప్పుడు రెవెన్యూ శాఖలో ఫోల్లుమంటున్న మాటలివి. ఎన్నికల ముందు బదిలీ అయిన తహసీల్దార్లకు ఊరట కలిగిస్తూ సొంత జిల్లాలకు తిరిగి బదిలీ చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడంతో కథ ఆరంభమైంది. సొంత జిల్లాలో కావాల్సిన మండలాలకు, ఆదాయం అధికంగా వచ్చే ప్రాంతాలకు పంపాలంటూ తహసీల్దార్లు అటు ఎమ్మెల్యేలను, ఇటు అసోసియేషన్ పెద్దలను ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డారు.

ఎక్కడెక్కడికి..?

తహసీల్దార్ల బదిలీల్లో మొదలైన పైరవీలు

- ఎన్నికల ముందు వెళ్లినవారంతా వెనక్కి..
- జిల్లాకు రానున్న 30 మంది తహసీల్దార్లు
- ఆదాయం తెచ్చేచోటకే వెళ్లాలని తహతహ
- కీలక మండలాలపైనే చాలామంది కన్ను
- ఎమ్మెల్యేలను ప్రసన్నం చేసుకునే పనిలో..
- ఆచీతూచి వ్యవహరిస్తున్న కూటమి నేతలు

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : జిల్లాలో తహసీల్దార్ల బదిలీలు జరిగాయి. ఎన్నికల నిబంధనల మేరకు కృష్ణాజిల్లా నుంచి ఏలూరు, తూర్పు, పశ్చిమగోదావరి, అంబేడ్కర్ కోనసీమ, అల్లూరి సీతారామరాజు జిల్లాలకు బదిలీపై వెళ్లిన 30 మంది తహసీల్దార్లను వెనక్కి పంపుతూ చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ (సీసీఎల్ఏ) శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఈ 30 మంది తహసీల్దార్లు గతంలో తాము పనిచేసిన కృష్ణాజిల్లాకు రానున్నారు. జిల్లాకు వచ్చిన తహసీల్దార్లకు వారి సొంత డివిజన్‌లో పోస్టింగ్ ఇవ్వొద్దని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. దీంతో తహసీల్దార్లు జిల్లాకు వచ్చినా గతంలో వారు పనిచేసిన మండలాలను కేటాయిస్తారా, లేక వేరే మండలాలకు పంపుతారా అనే అంశంపై స్పష్టత రాలేదు.

సిఫార్సులకే ప్రాధాన్యమా..?

జిల్లాలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో 25 మండలాలు ఉన్నాయి. మచిలీపట్నం, ఉయ్యూరు, గుడివాడలో ఆర్‌డీవో కార్యాలయాలు ఉన్నాయి. వీటిలోనే 30 మంది తహసీల్దార్లను సర్దుబాబు చేయాల్సి ఉంది. ఇక్కడే కీలక పరిణామం చోటుచేసుకుంటుందని రెవెన్యూ విభాగంలో పనిచేసే అధికారులు, ఉద్యోగులు చెప్పుకొంటున్నారు. పెడన, పామర్రు, గుడివాడ, గన్నవరం అసెంబ్లీ నియోజకవర్గాలకు మొదటిసారిగా ఎన్నికైన శాసనసభ్యులు ఉన్నారు. మచిలీపట్నం, అవనిగడ్డ, పెనమలూరు నియోజకవర్గాల్లో సీనియర్ ఎమ్మెల్యేలు ఉన్నారు. నూతనంగా ఎన్నికైన ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గ పరిధిలోని మండలాల్లో ప్రజలకు మంచిచేసే తహసీల్దార్లను ఎంపిక చేసుకునే పనిలో ఉన్నారు. దీంతో ఎవరికి ఏ మండలంలో పోస్టింగ్ వస్తుందనే అంశంపై ఉత్కంఠ నెలకొంది. ఇప్పటికే కొంతమంది తహసీల్దార్లు శాసనసభ్యుల వద్దకు, కూటమిలోని సీనియర్ నాయకుల వద్దకు వెళ్లి ప్రసన్నం చేసుకుంటున్నారు. సిఫార్సు లేఖలు ఇప్పటికిప్పుడు ఇవ్వలేమని, ప్రభుత్వ ఆలోచన మేరకు నడుచుకుంటామని శాసన సభ్యులు చెబుతూ వస్తున్నారు. ఇదిలా ఉంటే, తమకు అనుకూలంగా పనిచేసే తహసీల్దార్లను మాత్రమే మండలాలకు తెచ్చుకునే విషయంలో శాసనసభ్యులు ఆచీతూచి వ్యవహరిస్తున్నట్లు రెవెన్యూ విభాగంలో పనిచేసే అధికారులు చెబుతున్నారు.

- మిగతా 6లో

సొంత జిల్లాలకు తహసీల్దార్లు

రెండు జిల్లాలకు 48 మంది రాక

- ఎన్నికల ముందు ఇతర జిల్లాలకు బదిలీ అయినవారే..
- రేపు మండలాల కేటాయింపు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఎన్నికల ముందు ఇతర జిల్లాలకు బదిలీపై వెళ్లిన తహసీల్దార్లను సొంతజిల్లాలకు కేటాయిస్తూ శనివారం సీసీఎల్ఏ మెమో జారీ చేసింది. కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాలకు చెందిన మొత్తం 48 మంది తహసీల్దార్లను సొంత జిల్లాలకు కేటాయించారు. మెమో ప్రకారం రెండు జిల్లాలకు తిరిగి రానున్న తహసీల్దార్లకు కలెక్టర్లు పోస్టింగ్ ఇవ్వాల్సి ఉంటుంది. గతంలో తహసీల్దార్లు పనిచేసిన మండలాలు కాకుండా వేర్వేరు ప్రాంతాలు కేటాయించనున్నారు. వివాదాస్పదంగా ఉన్న వారిని, ఆరోపణలను ఎదుర్కొన్న వారికి ఫోకల్ స్థానాలు ఇవ్వకూడదని సీసీఎల్ఏ నుంచి కలెక్టర్లకు మౌఖిక ఆదేశాలు వచ్చినట్టుగా తెలుస్తోంది. దీంతో గత ప్రభుత్వ హయాంలో అంటకాగి ఏకపక్షంగా పనిచేసిన వారికి, అవినీతి ఆరోపణలు ఉన్నవారికి నాన్ ఫోకల్ పోస్టులను కేటాయించే అవకాశాలున్నాయి.

బదిలీ అయినవారు వీరే..

- ఎన్నికలకు ముందు కృష్ణాజిల్లా నుంచి బదిలీపై ఇతర జిల్లాలకు వెళ్లిన జి.రవికాంత్, ఏఎస్ఎన్ రాధిక, ఎం.సురేష్ కుమార్,

- మిగతా 6లో

జగన్‌రెడ్డీ..

శవ రాజకీయాలు మానుకో
ప్రజలు ఛీకొట్టినా మారరా..
మంత్రి కొల్లు రవీంద్ర ఆగ్రహం

6లో..

టీడీపీ నేతపై హత్యాయత్నం కేసులో నిందితులకు రిమాండ్

14 రోజుల రిమాండ్ విధించిన మొవ్వ కోర్టు


ప్రణతులివే.. ప్రకృతిమాతా..

రెండోరోజూ ఘనంగా శాకంబరీ ఉత్సవాలు

- నేడు పూర్ణాహుతితో ముగింపు

వన్‌టౌన్, జూలై 20 : శాకంబరీ ఉత్సవాల్లో రెండోరోజు కూడా దుర్గగుడికి భక్తులు పోటెత్తారు. కూరగాయలు, ఆకుకూరలతో అందంగా అలంకరించిన తోరణాలు ఆలయ ప్రాంగణాన్ని మరింత అందంగా మార్చాయి. ఓవైపు శాకంబరీ ఉత్సవాలకు తరలివచ్చే జనం, మరోవైపు ఆషాడ సారె తెచ్చే భక్తులతో కొండంతా కిటకిటలాడింది. వైదిక కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజాదికాలు జరిగాయి. కాగా, ఆదివారం ఉదయం పూర్ణాహుతితో మూడు రోజుల శాకంబరీ ఉత్సవాలు ముగుస్తాయి.

జగన్‌రెడ్డీ..శవ రాజకీయాలు మానుకో

» ప్రజలు ఛీకొట్టినా మార్పు రాలేదా: మంత్రి కొల్లు రవీంద్ర

మచిలీపట్నం టౌన్, జూలై 20: "ప్రజలు ఛీకొట్టినా జగన్‌రెడ్డిలో ఇంకా మార్పు రాలేదు. వినుకొండలో వ్యక్తిగత కక్షలతో జరిగిన హత్యను జగన్ రాజకీయం చేయాలనుకుంటున్నారు. ఇప్పటికైనా ఆయన శవ రాజకీయాలు మానుకోవాలి." అని మంత్రి కొల్లు రవీంద్ర హితవు పలికారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఐదేళ్లుగా వైసీపీ నాయకులు పల్నాడులో ఎంతటి భయానక వాతావరణం సృష్టించారో అందరికీ తెలుసన్నారు. వ్యవస్థను చక్కబెట్టే ప్రయత్నంలో ఉన్న ప్రభుత్వంపై లేనిపోని అభాండాలు వేయడం తప్ప జగన్‌రెడ్డికి మరో పని లేదన్నారు. దమ్ముంటే అసెంబ్లీకి వచ్చి జగన్‌రెడ్డి మాట్లాడాలన్నారు. ఎన్ని డ్రామాలు ఆడినా, కుట్రలు చేసినా ప్రజలు నమ్మబోరన్నారు. బాబాయ్ శవాన్ని అడ్డం పెట్టుకుని కోడికత్తి డ్రామాలాడి 2019లో జగన్ సీఎం అయ్యాడని విమర్శించారు.

మంత్రిని కలిసిన కృష్ణా ఎస్పీ



శాంతి భద్రతల పరిరక్షణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎస్పీ ఆర్.గంగాధరరావుకు మంత్రి కొల్లు రవీంద్ర సూచించారు. శనివారం మంత్రిని నూతనంగా పదవీ బాధ్యతలు చేపట్టిన ఎస్పీ మర్యాద పూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు.

గ్రీన్‌ఫీల్డ్ హైవేకు భూములిచ్చిన రైతులకు నష్టపరిహారం ఇప్పిస్తా: కేశినేని చిన్ని

విద్యాధరపురం, జూలై 20: విజయవాడ-నాగపూర్ 163(జీ) గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణం కోసం భూములిచ్చిన రైతులకు నష్ట పరిహారం ఇప్పించేందుకు కృషి చేస్తానని ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) హామీ ఇచ్చారు. జి.కొండూరు మండలం కవులూరుకు చెందిన రైతులు శనివారం ఎంపీని కలిశారు. తమకు నష్ట పరిహారం ఇప్పించాలని ఎంపీని కోరారు. అధికారులతో మాట్లాడి నష్టపరిహారం ఇప్పించేందుకు కృషి చేస్తానని చిన్ని హామీ ఇచ్చారు. గ్రామంలో 170 మంది హైవే నిర్మాణం కోసం భూములిచ్చారని, వారిలో 60 మందికే నష్ట పరిహారం అందిందని రైతులు తెలిపారు. మరో 20 మందికి అవార్డు వచ్చిందని, మిగిలిన 90 మందికి అవార్డు కాపీ రాలేదని, గెజిట్‌లో నమోదు కాలేదని వివరించారు. జంపాల సీతారామయ్య, భోగినేని రవీంద్రరావు, చెరుకూరి వేణుగోపాల్, భోగినేని సూర్యప్రకాష్‌రెడ్డి, మల్లేశ్వరరావు, అశోక్ పాల్గొన్నారు. చిన్నిని సత్కరించారు.

మర్యాదపూర్వకంగా..

విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)ను గురునానక్ కాలనీలోని ఎన్టీఆర్ భవన్‌లో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. పల్లా శ్రీనివాస్‌కు చిన్ని సాదర స్వాగతం పలికారు. తర్వాత వీరిద్దరూ పలు రాజకీయ అంశాలపై చర్చించుకున్నారు.



పల్లా శ్రీనివాసరావుకు స్వాగతం పలుకుతున్న కేశినేని చిన్ని

నూరు శాతం రాయితీపై ఆయిల్‌పామ్ మొక్కలు

అవనిగడ్డ రూరల్, జూలై 20: ఉద్యానవన శాఖ ద్వారా ఆయిల్‌పామ్ సాగు చేపట్టే రైతులకు వంద శాతం రాయితీపై హెక్టారుకు రూ.29 వేలు విలువైన 143 మొక్కలను రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా అందిస్తోందని కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ తెలిపారు. శనివారం అవనిగడ్డ మండల పరిషత్ కార్యాలయంలో జిల్లా ఉద్యానవనశాఖ ఆధ్వర్యంలో ఆయిల్‌పామ్ సాగుపై ఉద్యానవన, వ్యవసాయ సహాయ సిబ్బందికి నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఆయిల్‌పామ్‌లో అంతర పంటలకు హెక్టారుకు ఏడాదికి రూ.5,250 చొప్పున నాలుగేళ్లలో రూ.21 వేలు రాయితీ లభిస్తుందని తెలిపారు. చాప్ కట్టర్, వర్మీ కంపోస్టు యూనిట్లు, వైర్ మెష్‌పై 50 శాతం, డ్రిప్ ఇరిగేషన్‌కు 50 శాతం రాయితీ ఇస్తున్నారని, రైతులు వినియోగించుకోవాలని సూచించారు. ఆయిల్‌పామ్ పంటకు ప్రకృతి విపత్తుల నుంచి ఎలాంటి నష్టం రాదని తెలిపారు. ఆయిల్ పామ్ సాగు ప్రయోజనాలు- మార్కెట్ అవకాశాలపై జిల్లా రైతులకు అవగాహన కల్పించేందుకు జూలై 15 నుంచి సెప్టెంబరు 15 వరకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. ఎంపీపీ తుంగల సుమతి, ఉద్యానవన శాఖ జిల్లా అధికారి జె.జ్యోతి, ఏపీఎంఐపీ ప్రాజెక్టు డైరెక్టర్ జి.విజయలక్ష్మి, ఘంటసాల కృషివిజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త వి.మంజువాణి, అవనిగడ్డ ఉద్యానశాఖ అధికారి ఎన్.రమేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కృష్ణా కలెక్టర్ డీకే బాలాజీ

ప్రత్యేక కౌంటర్లలో బియ్యం, కందిపప్పు విక్రయాలు

కృష్ణలంక, జూలై 20: ఎన్టీఆర్ జిల్లాలోని అన్ని రైతుబజార్లు, ఉషోదయ, మెట్రో, రిలయన్స్, డీమార్ట్ వంటి వ్యాపార సంస్థల్లో ప్రత్యేక కౌంటర్ల ద్వారా నాణ్యమైన బియ్యం, కందిపప్పు అమ్మకాలు జరుగుతున్నాయని, ప్రజలందరూ వినియోగించుకోవాలని జాయింట్ కలెక్టర్ డాక్టర్ పి.సంపత్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బహిరంగ మార్కెట్‌లో రూ.181 ఉన్న దేశవాళి కందిపప్పును రూ.160కు, ఇప్పటివరకు 7 రైతు బజార్లలో, 27 బిగ్‌చైన్ రిటైల్ మార్కెట్లలో, 96 బియ్యం షాపుల్లో, 49 పప్పు ధాన్యాల షాపుల్లో ప్రత్యేక కౌంటర్లలో విక్రయిస్తున్నామన్నారు. కర్నూల్ సోనా మసూరి స్టీమ్ బియ్యం బహిరంగ మార్కెట్‌లో రూ.55.85 ఉందని, కిలో రూ.49కు, రూ.52.40 ఉన్న కర్నూల్ సోనామసూరి పచ్చిబియ్యాన్ని రూ.48కు తగ్గించి విక్రయిస్తున్నారని జేసీ తెలిపారు. ఇప్పటివరకు 5335 వినియోగదారులు 227.74 క్వింటాళ్ల బియ్యాన్ని, 6923 వినియోగదారులు 83.02 క్వింటాళ్ల కందిపప్పును ప్రత్యేక కౌంటర్లలో కొనుగోలు చేశారని తెలిపారు. కౌంటర్ల వద్ద సరుకుల నాణ్యతను టెక్నికల్ సిబ్బంది, తూకాన్ని లీగల్‌మెట్రాలజీ సిబ్బంది తనిఖీ చేస్తారని పేర్కొన్నారు.

గుమ్మడిదుర్రులో అతిసార

» ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆరుగురు గ్రామస్థులు

» నిల్వమాంసం తినడమే కారణమంటున్న పీహెచ్‌సీ వైద్యాధికారి

పెనుగంచిప్రోలు, జూలై 20: గుమ్మడిదుర్రు గ్రామంలో అతిసార వ్యాధితో పలువురు గ్రామస్థులు బాధపడుతున్నారు. రెండు రోజుల క్రితం ఓ ఇంట్లో నిల్వ ఉంచిన మాంసాన్ని వండుకుని తినటం వల్ల ఆ కుటుంబంతోపాటు పలువురు అతిసార బారిన పడ్డారని, జిల్లాలోని పలు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారని పీహెచ్‌సీ వైద్యాధికారి ఇందిర తెలిపారు. గుమ్మడిదుర్రు దళితవాడకు చెందిన బంక స్పందన విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రి, బంక రవి కుమార్ విజయవాడ ఆంధ్రా ఆస్పత్రి, నక్క కుమారి విజయవాడ హనుమాన్ ఆస్పత్రి, పత్తిపాటి తేజశ్రీ మంగళగిరి ఎయిమ్స్, పత్తిపాటి నాగ లక్ష్మి, ఉప్పులూరి రాహేలమ్మ నందిగామలోని పూజిత ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారని తెలిపారు. దళితవాడను డీఎంహెచ్‌వో డాక్టర్ సుహాసిని శనివారం సందర్శించి అధికారులకు పలు సూచనలు చేశారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు. గ్రామంలో రక్షిత మంచినీటిని పరీక్షల కోసం విజయవాడకు పంపారు. అతిసార తగ్గుముఖం పట్టే వరకు గ్రామంలో వైద్య శిబిరాన్ని నిర్వహించాలని ఆదేశించారు. ఎంపీడీవో హర్షసాయి, తహసీల్దార్ అమ్మాజీ, ఈవోపీఆర్డీ ప్రసాద్ పాల్గొన్నారు.



గుమ్మడిదుర్రులో పర్యటిస్తున్న డీఎంహెచ్‌వో సుహాసిని

వైదిక, స్మార్త రాత పరీక్షలకు దరఖాస్తులు

మచిలీపట్నం టౌన్, జూలై 20: దేవదాయశాఖ ఆధ్వర్యంలో నిర్వహించే వైదిక, స్మార్త, పాంచరాత్ర, వైఖానస, తంత్రసార, వీరశైవ, చాత్తాద శ్రీవైష్ణవ, గ్రామ దేవత ఆగమాలలో రాత పరీక్షలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు తెలిపారు. దరఖాస్తులను సెప్టెంబరు 20వతేదీలోగా పంపాలని ఆయన సూచించారు. 16-40 ఏళ్లలోపు అభ్యర్థులు రాతపరీక్షతో పాటు మౌఖిక పరీక్షలకు హాజరవ్వాలని, 40 ఏళ్లు పైబడిన వారికి రాత పరీక్ష ఉండదని, మౌఖిక పరీక్షకు మాత్రమే రావాలని, వివరాలకు 9491000607, 9440682996 నంబర్లకు ఫోన్ చేసి తెలుసుకోవాలని ఆయన సూచించారు.

స్పెషల్ పాలన



ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా ప్రత్యేకాధికారుల నియామకం

» మండలాలపై పర్యవేక్షణ కోసం 16 మంది..

» ప్రతి బుధవారం మండలాల పరిధిలో ఆకస్మిక తనిఖీలు

» పాలనలో మార్కు చూపిస్తున్న కలెక్టర్ సృజన

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): ప్రభుత్వ పాలనను ప్రజలకు చేరవేసేందుకు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ సృజన 'స్పెషల్' పాలనకు శ్రీకారం చుట్టారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా అమలు చేసే కార్యక్రమాలు, సంక్షేమ పథకాలను క్షేత్ర స్థాయిలో సమర్థవంతంగా అమలు చేసేందుకు స్పెషల్ అధికారుల నియామకాలకు ఆమె శ్రీకారం చుట్టారు. ఎన్టీఆర్ జిల్లావ్యాప్తంగా మండలాలకు స్పెషల్ ఆఫీసర్లను నియమించారు. 16 మండలాలకు 16 మంది జిల్లాస్థాయి అధికారులను స్పెషల్ ఆఫీసర్లుగా నియమించారు. స్పెషల్ ఆఫీసర్లు చెప్పినట్టుగా మండల అధికారులు నడుచుకోవాలి. జిల్లావ్యాప్తంగా నియమించిన స్పెషల్ ఆఫీసర్లకు కలెక్టర్ సృజన విశేష అధికారాలను కల్పించారు. మండల అధికారులు, గ్రామ సచివాలయాల విధులను స్పెషల్ ఆఫీసర్లు పర్యవేక్షిస్తారు. తనిఖీ అధికారాలను కూడా వారికి కలెక్టర్ కల్పించారు. ప్రతి బుధవారం తప్పనిసరిగా గ్రామాల్లో పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలు, హాస్టల్స్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఆర్బీకేలు, గ్రామ సచివాలయాలను ప్రత్యేకాధికారులు తనిఖీలు చేయాలి. చెక్‌లిస్ట్‌ల ప్రకారం రిమార్క్స్ రాసి సంతకం చేసి కలెక్టర్‌కు పంపాలి. వాటిపై కలెక్టర్ చర్యలు తీసుకుంటారు. ఉపాధి హామీ పథకం, ఆర్ అండ్‌బీ, పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా విభాగం(ఆర్‌డబ్ల్యూఎస్) విభాగాల పనులనూ వారు తనిఖీలు చేయాలి. స్పెషల్ ఆఫీసర్ల కోసం ప్రత్యేకంగా కలెక్టర్ వాట్సాప్‌గ్రూపును ఏర్పాటు చేయించారు. చెక్‌లిస్ట్ ప్రకారం సేకరించిన డేటాపై సంతకం చేసి కాపీని గ్రూపులో పోస్టు చేయాలి.

మండలాధికారులు పనిచేయకపోతే స్పెషల్ ఆఫీసర్లకు ఫిర్యాదు

మండలాధికారులు ప్రజలను ఇబ్బందులు పెట్టినా, కార్యాలయాలు చుట్టూ తిరిగేలా చేసినా తక్షణం స్పెషల్ ఆఫీసర్లకు ఫిర్యాదు చేయొచ్చు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే మండలాధికారులపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు స్పెషలాఫీసర్లు రాస్తారు.

స్పెషల్ ఆఫీసర్లు ..ఫోన్ నంబర్లు

ఎ.కొండూరు మండలానికి జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి కె.విద్యాసాగర్ (9989932852), గంపలగూడేనికి మెప్మా పీడీ పి.వెంకటనారాయణ(7901610163), విస్సన్నపేటకు జిల్లా మత్స్యశాఖ అధికారి వి.పెద్దిబాబు (9848350481), రెడ్డిగూడేనికి జిల్లా ఉద్యానశాఖాధికారి పి.బాలాజీకుమార్(7995086772), తిరువూరుకు డ్వామా పీడీ జె.సునీత(9441871260), జగ్గయ్యపేటకు సమగ్ర శిక్ష ఏపీడీ జి.మహేశ్వరరావు(9849902595), వత్సవాయికి జిల్లా యూత్ వెల్ఫేర్ ఆఫీసర్ యు.శ్రీనివాసరావు (9849909069), పెనుగంచిప్రోలుకు తూనికల కొలతల శాఖ అధికారి ఎ.కృష్ణ చైతన్య(9398143677), నందిగామకు డీడబ్ల్యూ అండ్ సీడబ్ల్యూ పీడీ జి.ఉమాదేవి (80747 83959), చందర్లపాడుకు గ్రౌండ్ వాటర్ డీడీ బి.నాగరాజు(83333991210), వీరులపాడుకు ఏపీఎంఐపీ పీడీ పీఎం సుభాని(7995087045), జి.కొండూరుకు సివిల్ సప్లయిస్ డీఎస్వో జి.మోహన్‌బాబు(80087 18146), మైలవరానికి డీపీవో ఎస్వీ శివప్రసాద్‌యాదవ్ (9704701961), ఇబ్రహీంపట్నానికి కేఆర్‌ఆర్‌సీ స్పెషల్ డిప్యూటీ తహసీల్దార్ ఇ.కిరణ్మయి(9154970452), విజయవాడ రూరల్ మండలానికి జిల్లా కో ఆపరేటివ్ ఆడిట్ అధికారి చిత్రపు శైలజ(9100109180)ను స్పెషల్ ఆఫీసర్లుగా కలెక్టర్ సృజన నియమించారు.

ఆర్ అండ్ బీ అధికారులొచ్చేవరకూ కదలను

» రోడ్డుపై మురుగు నీటిలో స్టూల్ వేసుకుని కూర్చున్న తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు

తిరువూరు, జూలై 20: ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తుండడంతో పట్టణంలోని అంతర్గత రహదారులు, డ్రెయిన్లను ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు శనివారం సైకిల్‌పై తిరుగుతూ పరిశీలించారు. పట్టణంలోని కోకిలంపాడు వెళ్లే రోడ్డులో టీటీడీ కల్యాణ మండపం వద్ద రోడ్డుపై పెద్దపెద్ద గోతుల్లో నీళ్లు నిలిచి రోడ్డుపై రాకపోకలకు ప్రజలు ఇబ్బంది పడుతున్నారని ఆయన గమనించారు. దీంతో ఆయన అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్డుపై నిలిచిన మురుగునీటిలో స్టూల్ వేసుకుని కూర్చున్నారు. అర్‌అండ్‌బీ అధికారులు అక్కడకు వచ్చేవరకు కదిలేది లేదని భీష్మించుకుని కూర్చున్నారు. దీంతో ఆర్ అండ్ బీ ఏఈ గాయత్రిదేవి అక్కడికి వచ్చారు. రహదారి అభివృద్ధికి రూ.1.95 కోట్లు నిధులు మంజూరయ్యాయని తెలిపారు. టెండర్ ప్రక్రియ పూర్తయిందని, వర్షాకాలం కావడం వల్ల రోడ్డుపనులు ప్రారంభించలేదని ఎమ్మెల్యేకు తెలిపారు. తాత్కాలికంగా రహదారిపై గోతులు పూడ్చించాలని ఆమెను ఎమ్మెల్యే ఆదేశించారు. వర్షాలు తగ్గాక రోడ్డుపై గోతులను పూడ్చి వేస్తామని ఎమ్మెల్యేకు ఆమె వివరించారు. ఎమ్మెల్యే రోడ్డుపై బైఠాయించడంతో మున్సిపల్ కమిషనర్ లోవరాజు, సిబ్బంది అక్కడకు చేరుకున్నారు. పట్టణంలో రహదారులపై నీరు నిల్వకుండా కచ్చా డ్రెయిన్లు తీయించాలని వారిని ఆదేశించారు.



తిరువూరు టీటీడీ కల్యాణ మండపం వద్ద మురుగునీటిలో స్టూల్‌పై కూర్చున్న కొలికపూడి

తెలంగాణకు ఇసుక రవాణా

» లారీ స్వాధీనం..డ్రైవర్‌పై కేసు

జగ్గయ్యపేట రూరల్, జూలై 20: తెలంగాణకు ఇసుకను అనధికారికంగా తరలిస్తున్న లారీని అంతర్రాష్ట్ర సరిహద్దు గరికపాడు వద్ద శుక్రవారం రాత్రి స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు చిల్లకల్లు ఎస్ఐ సతీష్ తెలిపారు. టీజీ 29 టీవో 0789 నంబరు లారీలో కంచికచర్ల మండలం మోగులూరు వద్ద ఇసుక లోడ్ చేసుకుని వే బిల్లులో మాత్రం జగ్గయ్యపేట మండలంలోని బూదవాడకు తరలిస్తున్నట్లు పేర్కొన్నారని వాహనం తెలంగాణలోకి వెళ్తుండటంతో లారీతో పాటు వెలది కొత్తపాలేనికి చెందిన డ్రైవర్ కుంచపు రామకృష్ణ, మహేష్‌పై కేసు నమోదు చేశామని ఆయన తెలిపారు.





నెంబరు ప్లేట్‌పై టీజీ తొలగించి ఇసుక రవాణా

వాహనాన్ని గుర్తించకుండా..

సీసీ కెమెరాలు ఫొటోలు తీసినా వాహనాన్ని గుర్తించకుండా తెలంగాణకు ఇసుక తరలించే వాహనాల రిజిస్ట్రేషన్ బోర్డుపై టీజీని అక్రమార్కులు తొలగిస్తున్నారు. ఆధార్ కార్డుతో రోజుకు 20 టన్నుల వరకు ఇసుక తీసుకెళ్లవచ్చన్న నిబంధనను ఉపయోగించుకుని, ట్రాక్టర్, లారీ యజమానులు డంపింగ్ యార్డుల నుంచి ఇసుక తెచ్చి ఏదో ఒక ప్రాంతంలో తెలంగాణ లారీల్లోకి నింపుకొని, జాతీయ రహదారి ద్వారా కానీ గ్రామాల్లోని డొంక రోడ్ల ద్వారాగానీ తెలంగాణాలకు తరలిస్తున్నారు.

దంత వైద్య కళాశాలలో ఖాళీ పోస్టులు

ప్రభుత్వాసుపత్రి, జూలై 20: ప్రభుత్వ దంత వైద్య కళాశాలలో కాంట్రాక్ట్ పద్ధతిలో డిస్ట్రిక్ట్ కమిటీ ద్వారా ఖాళీ పోస్టుల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. శ్రీనివాసరావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. డెంటల్ హైజీనిస్ట్-1, డెంటల్ టెక్నీషియన్-1, డెంటల్ మెకానిక్-1 పోస్టుకు అర్హత గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. మరిన్ని వివరాల కోసం వెబ్‌సైట్‌లో చూసుకోవాలని సూచించారు.

డీజిల్‌కు బదులు నీళ్లు

» లబోదిబోమంటున్న టాక్టర్ యజమాని

» బంక్ యజమాని నిర్లక్ష్యంగా సమాధానం చెప్పాడని ఆవేదన

విస్సన్నపేట, జూలై 20: పుట్రేలలో వెంకటేశ్వర రావు ఫిల్లింగ్ సెంటర్ (పెట్రోల్ బంక్)లో అదే గ్రామానికి చెందిన లింగాల శ్రీనివాస్ అనే ట్రాక్టర్ యజమాని డీజిల్‌ను రూ.3 వేల కొట్టించాడు. పొలం పనులకు వెళుతుండగా మధ్యలో ట్రాక్టర్ ఆగిపోయింది. దీంతో ట్రాక్టర్ యజమాని శ్రీనివాస్ మెకానిక్‌ను పిలిచి ట్రాక్టర్‌ను చూపించారు. ట్రాక్టర్‌లో డీజిల్‌కు బదులు నీళ్లు ఉన్నాయని ఆయన గుర్తించాడు. దీనిపై హెచ్‌పీసీఎల్ బంక్ యజమానిని అడుగగా నిర్లక్ష్యంగా సమాధానం చెప్పారని శ్రీనివాసరావు వాపోయాడు. ట్రాక్టర్ మరమ్మతుకు భారీగా ఖర్చవుతుందని, మరో పక్క వ్యవసాయ పనులకు అంతరాయం ఏర్పడుతుందని ఆవేదన చెందుతున్నాడు. దీనిపై బంక్ మేనేజర్‌ను వివరణ కోరగా.. ఉదయం నుంచి పదుల సంఖ్యలో డీజిల్ విక్రయాలు చేశామని ఎవ్వరూ నీరు కలిసినట్లు ఫిర్యాదు చేయలేదని, డీజిల్‌లో కల్తీ జరగలేదని తెలిపారు.



పుట్రేలకు చెందిన లింగాల శ్రీనివాసరావు ట్రాక్టర్ నుంచి బయటకు తీస్తున్న నీరు

నాకు న్యాయం చేయండి

» విధుల్లో చేరి ఎనిమిది నెలలైనా ఇంకా ఆన్‌లైన్‌లో పాత వీవోఏ పేరే

» పేరు నమోదుపై ప్రశ్నిస్తే వీవోఏగా తప్పుకోమంటున్నారు

» వెలుగు ప్రాజెక్టు అధికారుల తీరుపై అర్తమూరు వీవోఏ నాగ చంద్రపావని ఆవేదన

బంటుమిల్లి: ప్రభుత్వం 60 ఏళ్లు దాటిన వీవోఏలను తొలగించి వారి స్థానంలో కొత్త వారిని నియమించాలంటూ గత ఏడాది 2023 సెప్టెంబరు 18న ఆదేశాలు జారీ చేసింది. దీంతో బంటుమిల్లి మండలం అర్తమూరు వీవో-2లో పని చేస్తున్న వీవోఏకి 60ఏళ్లు దాటడంతో పదవీ విరమణ చేయించారు. గ్రామానికి చెందిన దొడ్డాక నాగ చంద్రపావనిని గ్రామైఖ్య సంఘంలో వీవోఏగా తీర్మానం చేసి గత ఏడాది 2023 డిసెంబరు 2తేదిన విధులు అప్పగించారు. అప్పటి నుంచి నాగచంద్ర పావని వీవోఏగా విధులు నిర్వహిస్తున్నారు. కానీ ఇప్పటి వరకు పదవీవిరమణ చేసిన పాత వీవోఏనే ఆన్‌లైన్ రికార్డుల్లో కొనసాగుతున్నారు. పేరు మార్చలేదు. దీనిపై కొత్తగా విధులు నిర్వహిస్తున్న నాగచంద్రపావని అధికారులను సంప్రదించారు. ఫలితం లేకపోయేసరికి మచిలీపట్నం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో అర్జీ ఇచ్చారు. అర్జీ అందుకున్న కలెక్టర్ వెలుగు ప్రాజెక్టు అధికారికి పరిశీలన నిమిత్తం దానిని పంపారు. జిల్లా వెలుగు ప్రాజెక్టు అధికారి పెడన క్లస్టర్ ఏసీని వివరణ అడిగి అర్జీని ఆన్‌లైన్ చేయకుండా పంపించేశారు. గ్రామ సమైఖ్య సంఘంలో తీర్మానం చేసి 8 నెలలుగా విధులు నిర్వహిస్తున్నప్పటికీ తన పేరును ఆన్‌లైన్‌లో నమోదు చేయకుండా అధికారులు తనతో సేవలు చేయించుకుంటున్నారని నాగపావని ఆవేదన వ్యక్తం చేసింది. ఆన్‌లైన్‌లో పేరు నమోదు కాలేదని ప్రశ్నించినందుకు, అధికారులు పెట్టిన షరతులకు ఒప్పుకోనందుకు రికార్డులు అప్పగించాలని వీవోఏగా తొలగిస్తున్నామని అధికారులు ఒత్తిడి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేసింది.

రికార్డులు పాత వీవోఏకు అప్పగించమని ఒత్తిడి చేస్తున్నారు



వీవోఏగా చేరకు ముందు చిన్న ఉద్యోగం చేసుకునేదాన్ని. దానికి రాజీనామా చేయించి వీవోఏగా చేర్చుకున్నారు. చేరాక వెలుగు ప్రాజెక్టు అధికారులను కలిస్తే పాత వీవోఏకు రూ.50 వేలు ఇవ్వాలని సూచించారు. మరలా నీకు ఉద్యోగం రావడానికి కారకులు ఎవరో వారికి ఇవ్వాలని సూచించారు. అందుకు నేను ఒప్పుకోలేదు. నేను 8 నెలలుగా విధులు నిర్వహిస్తున్నా. నాపేరు ఆన్‌లైన్‌లో ఎక్కించలేదు. పాత వీవోఏనే ఆన్‌లైన్‌లో కొనసాగుతున్నారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ఫిర్యాదు ఇచ్చినా న్యాయం జరగలేదు. ఇవి మనసులో పెట్టుకుని నా దగ్గర ఉన్న రికార్డు పుస్తకాలు వెంటనే పాత వీవోఏకు అప్పగించాలని ఒత్తిడి చేస్తున్నారు. రికార్డు పుస్తకాలు అప్పగించకపోతే కొత్త రికార్డు పుస్తకాలతో విధులు నిర్వహిస్తామంటున్నారు. వీవో పరిధిలో ఉన్న మహిళే వీవోఏగా పని చేయాలని, తనను విధుల నుంచి తప్పుకోవాలని హెచ్చరిస్తున్నారు. ఎలాంటి నోటీసు ఇవ్వలేదు. మాటే శాసనం అంటున్నారు. అధికారులు ప్రజాప్రతినిధులు స్పందించి నాకు న్యాయం చేయాలి.

- నాగచంద్రపావని, అర్తమూరు వీవోఏ

సమాధానం దాటేసిన వెలుగు ప్రాజెక్టు అధికారి

వీవోఏ నాగచంద్రపావనికి అర్హతలు ఉన్నాయో లేదో గుర్తించకుండానే 8 నెలల పాటు సేవలు ఎలా వినియోగించుకున్నారని బంటుమిల్లి వెలుగు ప్రాజెక్టు అధికారి శ్రీనివాసరావు ప్రశ్నిస్తే మీ పత్రిక వచ్చి ఎంతకాలం అయ్యింది. మీరెన్ని వెలుగులోకి తెచ్చారంటూ సమాధానం దాటేసి, విలేకరిపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

గుర్రపుడెక్క, తూటుకాడ తొలగింపు పనులు ప్రారంభం

ఘంటసాల, జూలై 20: గుండేరులో పేరుకుపోయిన గుర్రపుడెక్క తొలగింపు పనులను శనివారం డ్రెయినేజీ అధికారులు ప్రారంభించారు. 'డ్రెయిన్లలో పేరుకుపోయిన డెక్క' పేరుతో ఆంధ్రజ్యోతిలో శనివారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. కాంట్రాక్టర్‌తో మాట్లాడి పనులు వేగవంతం చేయించారు. కొడాలి, ఘంటసాలపాలెం, దేవరకోట, బిరుదుగడ్డ గ్రామాల్లో గుండేరు డ్రెయిన్‌పై ఉన్న వంతెనల వద్ద పేరుకుపోయిన తూటుకాడ, గుర్రపుడెక్క తొలగింపు పనులు చేపట్టారు. చాట్రగడ్డ దళితవాడ వంతెన వద్ద కూలీల సాయంతో డ్రెయిన్‌లో ఉన్న గుర్రపుడెక్కను తొలగించారు. పనులను ఏఈఈ హరీష్ పర్యవేక్షించారు. గుండేరు డ్రెయిన్‌లో వంతెనల వద్ద నీటి పారుదలకు అడ్డంగా నిలిచిపోయిన గుర్రపుడెక్కను ఆపరేషన్ అండ్ మెయింటెన్స్ నిధుల కింద తొలగింపు పనులు చేపట్టామని డ్రెయినేజీ డీఈఈ పి.వెంకటేశ్వరరావు తెలిపారు.



దేవరకోట వద్ద తూటుకాడ తొలగిస్తున్న యంత్రం

బాక్సింగ్ క్రీడాకారుడికి సత్కారం

అవనిగడ్డ, జూలై 20: నార్త్ అమెరికాలో నిర్వహించిన ముయాతాయ్ బాక్సింగ్ ప్రపంచ చాంపియన్‌షిప్‌లో సిల్వర్ మెడల్ గెలుచుకున్న నిజాంపట్నం వాసి కె.అశోక్‌కుమార్‌కు అవనిగడ్డలో నియోజకవర్గ వ్యాయామోపాధ్యాయుల సంఘం ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో పౌర సత్కారం చేశారు. మత్స్యకార యువకుడు కె.అశోక్‌కుమార్ ఆర్థిక ఇబ్బందులు కారణంగా క్రీడలకు దూరం కాకూడదనే అమెరికాలో పోటీల్లో పాల్గొనేందుకు తాను స్పాన్సర్‌షిప్ ఇచ్చానని, దీనిని సద్వినియోగం చేసుకుని సిల్వర్ మెడల్ సాధించారని పారిశ్రామికవేత్త విక్కుర్తి శ్రీనివాస్ తెలిపారు. వ్యాయామోపాధ్యాయుల సంఘ నేతలు కోసూరి పూర్ణచంద్రరావు, గరికపాటి గోపాల్, సింహాద్రి గంగాధర్, ఉదయ్, గరికపాటి మారుతి పాల్గొన్నారు. విక్కుర్తి శ్రీనివాస్, అశోక్‌కుమార్‌ను వ్యాయామోపాధ్యాయులు సత్కరించారు.



అశోక్ కుమార్‌ను సత్కరిస్తున్న విక్కుర్తి శ్రీనివాస్, వ్యాయామోపాధ్యాయులు

మెట్ట పంటలు కళకళ

» మరో రెండు రోజులు వర్షం కురిస్తే పంటలు దెబ్బతింటాయని రైతుల ఆందోళన

కంచికచర్ల, జూలై 20: కురుస్తున్న వర్షాలవల్ల నందిగామ డివిజన్ పరిధిలో మెట్ట పంటలు కళకళలాడుతున్నాయి. నాన్పుడు వాన కావటంతో ఇప్పటికే భూమిలో తేమశాతం ఎక్కువైంది. వాతావరణ శాఖ అధికారులు హెచ్చరిస్తున్నట్టుగా మరో రెండు, మూడు రోజులు భారీ వర్షాలు కురిస్తే పంటలు దెబ్బతింటాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ ఏడాది నందిగామ వ్యవసాయ సబ్ డివి జన్‌లో పత్తి, పెసర, మినుము, మొక్కజొన్న, కంది, మిర్చి పంటలు 60 వేల ఎకరాల్లో సాగు చేశారు. చెరువులు, ఎత్తిపోతల పథకాల ఆయకట్టులో వరినారుమళ్లు పోశారు. వర్షాలకు పత్తి మొక్కలు ఎదుగుతున్నాయి. మొక్కజొన్న రెండు, మూడు అడుగులు పెరిగింది. పెసర పూతకు వచ్చింది. అక్కడక్కడ పెసర చేలకు పల్లాకు తెగులు సోకింది. వర్షం ఇంతటితో ఆగిపోతే పంటలకు ఎంతో మేలు చేకూరుతుంది. రైతులు కూడా ఎరువులు వేసి, కలుపుమొక్కలు తీయటానికి వీలుపడుతుంది. ఈదురు గాలులకు పలుచోట్ల ముదురు పెసర, మొక్కజొన్న చేలు తలవాల్చాయి. తేమ ఎక్కువ కావడం వల్ల ఇంకా వర్షం కురిస్తే పంటలకు దెబ్బతింటాయి. గాలి ఆడక, ఎండ తగలక ఎండుతెగులు, కుళ్లుతెగులు వ్యాపించి, వేర్లు కుళ్లిపోతాయి. మరో రెండు మూడు రోజులు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు చెబుతుండడంతో పైర్లు నిలువునా దెబ్బతింటాయని రైతులు చెబుతున్నారు.



కళకళలాడుతున్న పెసర చేను

రక్షణ చర్యలు తీసుకోవాలి

ఇంకా వర్షాలు కురిస్తే మెట్ట పంటలకు దెబ్బ. వర్షాలు ఆగిన వెంటనే రైతులు పంటలకు రక్షణ చర్యలు తీసుకోవాలి. పొలాల్లో నీళ్లు నిలిస్తే వెంటనే బయటకు పంపాలి. ఎకరానికి 25 నుంచి 30 కిలోల యూరియా, 15 కిలోల పొటాష్ మొక్కల మొదళ్ల వద్ద చల్లాలి. **- రమేష్, వ్యవసాయ అధికారి, చందర్లపాడు**

హత్యాయత్నం కేసులో నిందితులకు రిమాండ్

మోపిదేవి, జూలై 20: మండల పరిషత్ కో-ఆప్షన్ సభ్యుడు, కె.కొత్తపాలేనికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు చందన రంగారావుపై హత్యాయత్నానికి పాల్పడిన వైసీపీకి చెందిన మత్తి రాంప్రసాద్, మత్తి శ్రీనివాసరావుకు న్యాయస్థానం 14 రోజుల రిమాండ్ విధించిందని చల్లపల్లి సీఐ సీహెచ్ నాగప్రసాద్ తెలిపారు. ఈనెల 17న కృష్ణా నది కరకట్టపై బండికోళ్లలంక వద్ద రంగారావుపై నిందితులు హత్యాయత్నం చేశారని, శనివారం అరెస్టు చేసి మొవ్వ కోర్టులో హాజరుపరచామని ఆయన తెలిపారు. కోర్టులో హాజరుపరిచేముందు నిందితులను మీడియా ఎదుట ప్రవేశ పెట్టారు.

ఎక్కడెక్కడికి..?

(ఐదో పేజీ తరువాయి)

రిలీవ్‌కు మూడు రోజుల సమయం

గతంలో కృష్ణాజిల్లాలో పనిచేస్తూ ఎన్నికల సంఘం ఉత్తర్వులతో ఇతర జిల్లాలకు బదిలీపై వెళ్లిన వారిని తిరిగి ఇక్కడికి పంపుతూ శనివారం ఉత్తర్వులు జారీ అయినా, వారు మూడు, నాలుగు రోజుల తరువాతే రిలీవ్ అయ్యే అవకాశం ఉంది. తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాలను ప్రస్తుతం వరదలు వెంటాడుతున్నాయి. వర్షాలు, వరదలు తగ్గుముఖం పట్టాకే తమను రిలీవ్ చేస్తారని తహసీల్దార్లు చెబుతున్నారు. కృష్ణాజిల్లాలో ప్రస్తుతం పనిచేస్తున్న తహసీల్దార్లు కూడా ఇంకా రిలీవ్ కాలేదు. రిలీవ్ ఆదేశాలు అందుకుని, జిల్లాకు వచ్చిన తరువాతే అసలు కథ ప్రారంభమవుతుందని అంటున్నారు. ఎవరిని ఏ మండలానికి కేటాయించాలో శాసనసభ్యులు జాబితాలు తయారు చేసి కలెక్టర్‌కు పంపితే, కొద్దిపాటి మార్పులు చేసిన అనంతరం మండలాలు కేటాయిస్తారని రెవెన్యూ విభాగం ఉద్యోగుల మాట.

కీలక మండలాలకు పోటీ

జిల్లాలోని అధిక ఆదాయం వచ్చే మండలాల్లో పోస్టింగ్ పొందేందుకు కొందరు తహసీల్దార్లు తెరవెనుక ప్రయత్నాలు చేసుకుంటున్నారు. గన్నవరం, బాపులపాడు, ఉయ్యూరు, తోట్లవల్లూరు, పెనమలూరు, మచిలీపట్నం, బంటుమిల్లి, పెడన తదితర మండలాల్లో పోస్టింగ్ కావాలని కొంతమంది తహసీల్దార్లు మంత్రులు, శాసన సభ్యులు, రెవెన్యూ అసోసియేషన్‌లో కీలక నాయకుల వద్దకు వెళ్లి ప్రయత్నాలు చేసుకుంటున్నారు.

సొంత జిల్లాలకు తహసీల్దార్లు

(ఐదో పేజీ తరువాయి)

టి.మల్లిఖార్జునరావు, బి.శ్రీనునాయక్, కేజీఎన్ సోమేశ్వర రావు, డి.ప్రశాంతి, ఎల్‌వీఎస్ రామకృష్ణ, బి.రామానాయక్, కె.గోపాలకృష్ణ, పి.మధుసూదనరావు, కె.నవీన్‌కుమార్, వి.రామకోటేశ్వరరావు, షేక్ లతీఫ్‌పాషా, కె.సత్య సులోచన, డి.వనజాక్షి, అబ్దుల్ రెహమాన్ మస్తాన్, వి.నాగభూషణం, వి.భావన్నారాయణ, కె.ఆంజనేయులు, డి.సునీల్‌బాబు, సీహెచ్ నరసింహారావు, బి.నీల్సన్‌పాల్ బాబు, డి.రాజ్యలక్ష్మి, కె.మస్తాన్, పీఎస్‌వీ ప్రసాద్, కె.వెంకట శివయ్య, సీహెచ్ వీరాంజనేయప్రసాద్, వై.రంగారావు, వీవీ భరత్‌రెడ్డి తిరిగి వెనక్కి వస్తున్నారు.

- ఎన్నికలకు ముందు ఎన్టీఆర్ జిల్లా నుంచి బదిలీపై ఇతర జిల్లాలకు వెళ్లిన షేక్ ఇంతియాజ్ పాషా, బి.హేమ కుమారి, సీహెచ్ దుర్గాప్రసాద్, ఎం.పాల్, ఎన్.సురేష్ బాబు, జి.బాలకృష్ణారెడ్డి, చాట్ల వెంకటేశ్వర్లు, ఎస్.నరసింహారావు, జె.సుశీలాదేవి, బి.అసయ్య, కె.లక్ష్మీ కల్యాణి, ఎస్.శ్రీనివాసరెడ్డి, వి.రాజకుమారి, ఎం.శ్రీనివాసరావు, కాశీలక్ష్మి, ఎం.వెంకట రామయ్య, ఆర్‌వీవీ రోహిణీదేవిని తిరిగి సొంత జిల్లాకు కేటాయించారు. వీరందరికీ కలెక్టర్లు సోమవారం నాటికి మండలాలను కేటాయించనున్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	118, 127, 138
చికెన్ విత్ స్కిన్	224
చికెన్ స్కిన్‌లెస్	234

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 5.30

కౌలు కార్డులివ్వాలి

కంకిపాడు, జూలై 20 : భూ యజమాని సంతకంతో ప్రమేయం లేకుండానే కౌలు రైతుకు కౌలు కార్డు అందజేయాలని కౌలు రైతు జిల్లా కార్యదర్శి పంచకర్ల రంగారావు అన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ రామకృష్ణను కలిసి ఈ మేరకు శనివారం వినతి పత్రాన్ని అందచేశారు. ఈ కార్యక్రమంలో వి. శివశంకర్, జె. రవి, వి. మరియదాసు, టి. నరేష్, ఏ.తిరుపతమ్మ తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్ రామకృష్ణకు వినతిపత్రం అందజేస్తున్న కౌలు రైతు సంఘం నాయకులు

విద్యార్థుల అభ్యున్నతికి కృషి చేయాలి

● జిల్లా విద్యాశాఖ అధికారి తాహిరా సుల్తానా

ఈడుపుగల్లు (కంకిపాడు), జూలై 20 : విద్యార్థుల అభ్యున్నతికి ఉపాధ్యాయులు శక్తి వంచన లేకుండా కృషి చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి తాహెరా సుల్తానా అన్నారు. మండలంలోని ఈడుపుగల్లు జిల్లా పరిషత్ పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు నిర్వహిస్తు న్న శిక్షణ తరగతులను ఆమె శనివారం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి కె.ఎస్.వి ప్రసాద్, సమగ్ర శిక్ష సెక్టోరియల్ ఆఫీసర్స్ సుభాష్, నగేష్, రాంబాబు, మాస్టర్స్ ట్రైనర్స్ లలిత, మోహన్, బాబు, దిలీప్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో తాహెరా సుల్తానా

హెల్మెట్‌తో ప్రాణాలు కాపాడుకోండి



హెల్మెట్ వినియోగంపై అవగాహన ర్యాలీలో న్యాయాధికారి శ్రీహరి

ఉయ్యూరు, జూలై 20 : ద్విచక్ర వాహనాలపై వెళ్లేవారు విధిగా హెల్మెట్ వినియోగించి ప్రమాదాలనుంచి ప్రాణాలు కాపాడుకోవాలని ఉయ్యూరు న్యాయాధికారి కె.శ్రీహరి అన్నారు. మండల న్యాయ సేవాధికార కమిటీ ఆధ్వర్యంలో శనివారం హెల్మెట్ వాడకంపై నిర్వహించిన అవగాహన ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కాగిత గోపిచంద్, ఉపాధ్యక్షుడు పల్లి అశోక్, జి.శ్రీకృష్ణకు మార్, సూర్యనారాయణ, వసుధారాణి, ఉయ్యూరు, రూరల్, పమిడిముక్కల, తోట్లవల్లూరు ఎస్సైలు గణేశ్ కుమార్, అవినాష్ కె. శ్రీనివాస్, విశ్వనాథ్, పోలీస్, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు ముమ్మరం చేయాలి

అధికారులకు ఎమ్మెల్యే యార్లగడ్డ ఆదేశం

గన్నవరం, జూలై 20 : గ్రామాల్లో పారిశుధ్య పనులు ముమ్మరం చేయాలని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అధికారులను ఆదేశించారు. నాలుగు రోజులుగా కురుస్తున్న కారణంగా నియోజకవర్గంలో అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని శనివారం ఫోన్‌లో అధికారులకు యార్లగడ్డ తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ, గ్రామాల్లో నీటి నిల్వలు లేకుండా తగిన చర్యలు తీసుకో వాలన్నారు. యుద్ధ ప్రాతిపదికన పారిశుధ్య పనులు చేపట్టాల న్నారు. నియోజకవర్గంలో భారీ వర్షాల ప్రభావంపై గ్రామాల వారీగా తహసీల్దార్ ఎంపీడీవోలను అడిగి తెలుసుకున్నారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయ చర్యలు చేపట్టాలని, డ్రైనేజీల్లో పూడికతీసి మురుగునీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. డ్రైనేజీల పూడికతీత పనులకు నిధుల కొరత ఉంటే ప్రత్యేకంగా నిధులు మంజూరు చేయిస్తానని, వర్షాలు తగ్గిన వెంటనే డ్రైనేజీ సమస్య శాశ్వత పరిష్కారానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. అధికారులంతా అప్రమత్తంగా ఉండా లన్నారు. ఎక్కడ ఎలాంటి ప్రమాదం సంభవించినా తక్షణమే అక్కడ ఉండి ఆస్తి, ప్రాణ నష్టాలను నివారించాలన్నారు. ఉద్యాన శాఖ అధికారులు కూరగాయలు సాగుచేసే రైతులకు సూచనలు ఇవ్వాలన్నారు. కాలువల్లో తూటుకాడ పెరిగిపోయి నీటి పారుదలకు ఆటంకం కలిగిస్తుందని అధికారులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా ఈ సమస్యపై కలెక్టర్‌తో మట్లాడి నిధులు మంజూరు చేయిస్తానని, అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు.



అధికారులకు ఫోన్‌లో సూచనలిస్తున్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

లోతట్టు ప్రాంతాలు జలమయం

మండలంలో ఎడతెరపి లేకుండా భారీ వర్షాలకు లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. 21 గ్రామ పంచాయితీల్లో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. డ్రైనేజీ నీరు అంతా రోడ్ల మీదే ప్రవహిస్తోంది. బల్లిపర్రు బీసీ కాలనీలో రోడ్లు చెరువు లను తలపిస్తున్నాయి. రాకపోకలు సాగించాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పంచాయతీ పాలకులు, అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవటం లేదని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఫిర్యాదు చేసినా స్పందన లేదంటున్నారు. వీఎన్‌పురం కాలనీలో పలు అడ్డరోడ్లు నీటితో మునిగిపోయాయి. పురుషోత్తపట్నం ఎస్సీ కాలనీలో డ్రైనేజీలో నీరంతా రోడ్డు మీదకు వచ్చి అధ్వానంగా ఉంది. గన్నవరం పట్టణంలో ఎన్టీఆర్ బొమ్మ దగ్గర, బుద్ధవరం బస్టాప్ దగ్గర యాదవుల రామాలయం, డౌన్ హోటల్ దగ్గర నీళ్లు నిలిచాయి. చింతగుంట, చిక్కవరం, కొత్తగూడెం డ్రైనేజీలు పూడుకుపోయాయి. తక్షణ చర్యలు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.



బల్లిపర్రులో చెరువును తలపిస్తున్న బీసీ కాలనీ

మహిళ ఆత్మహత్య

హనుమాన్‌జంక్షన్, జూలై 20 : అప్పులు బాధ తట్టుకోలేక పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన మహిళ కేసు శనివారం జంక్షన్ పీఎస్‌లో నమోదయ్యింది. ఎస్సై జనార్దన్ తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక కె.ఎస్. టాకీస్ రోడ్డులో నివాసం ఉంటున్న బండారు జ్యోతి (43) ఈ నెల 10 తేదీన కలుపు మందు తాగి ఆత్మహత్య యత్నానికి పాల్పడింది. ప్రాణాపాయ స్థితిలో ఆమెను చిన్నఅవుటపల్లి పిన్నమనేని సిద్ధార్థ వైద్య కళాశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన్లు ఎస్సై తెలిపారు.

రాయితీపై బియ్యం, కందిపప్పు

ఉయ్యూరు, జూలై 20 : ఉయ్యూరు రైతుబజార్లో బియ్యం, కందిపప్పు రాయితీపై విక్రయించేందుకు ప్రత్యేక కౌంటర్ ప్రారభించినట్టు మండల తహసీల్దార్ గురుమూర్తి రెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. దేశవాళీ కందిపప్పు కేజీ రూ. 160, నాణ్యమైన స్టీమ్ రైస్ (బీపీటీ, సోనామ సూరి) కేజీ రూ. 49, ముడిబియ్యం రూ. 48 చొప్పున వినియోగదారులకు సరఫరా చేస్తున్నట్టు తెలిపారు. ప్రత్యేక కౌంటర్లలో కందిపప్పు, బియ్యం కొనుగోలుకు సంబంధించి వినియోగదారులకు ఏదైనా అసౌకర్యం కలిగితే సంబంధిత అధికారులకు తెలియజేయాలని పేర్కొన్నారు.

జంక్షన్‌లో..

హనుమాన్‌జంక్షన్ : ప్రభుత్వం నిర్దేశించిన సరసమైన ధరలకు దేశవాలీ కందిపప్పు, స్టీమ్డ్ బియ్యం విక్రయించే రెండు స్టాల్స్‌ను హనుమాన్‌జంక్షన్‌లో ఏర్పాటు చేసినట్లు గన్నవరం పీడీఎస్ డీటీ ప్రధాన్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నాణ్యమైన సరసమైన కందిపప్పు, బియ్యం ఇవ్వాలనే ఉద్దేశంతో గన్నవరం రైతుబజార్‌లో స్టాల్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. హనుమాన్‌జంక్షన్‌లో కూడా ఉషోదయ మార్ట్‌లో స్టాల్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. శనివారం నుంచి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ వెనుక పక్క ఉన్న వెంకట సత్యనారాయణ జనరల్ స్టోర్‌లో స్టాల్ ప్రారంభించినట్లు తెలిపారు.

కనకదుర్గమ్మకు ఆషాఢ సారె

హనుమాన్‌జంక్షన్, జూలై 20: ఆషాఢమాసం సందర్భంగా సమరసత ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం విజయవాడ కనకదుర్గ అమ్మ వారికి కొత్త వేలేరు నుంచి ఆషాఢమాస సారెను వేడుకగా సమర్పించారు. సమరసత నాయకురాలు ప్రమీలరాణి, యడవల్లి పాండురంగారావు పాల్గొన్నారు.



విజయవాడ కనకదుర్గమ్మకు సారె తీసుకువెళ్తున్న భక్తులు

పవన్ కల్యాణ్‌కు పటిష్ట భద్రత కల్పించాలి

కంకిపాడు, జూలై 20 : రాష్ట్ర డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జెడ్ ప్లస్ కేటగిరి భద్రత కల్పించాలని జనసేన పార్టీ పెనమలూరు నియోజకవర్గ సమన్వయకర్త ముప్పా రాజా అన్నారు. స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, పవన్ కల్యాణ్ ప్రాణాలకు హాని ఉన్నట్లు సోషల్ మీడియాలో వస్తున్న కథనాలను ప్రభుత్వం పరిశీలనలోకి తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో నాగశ్రీ, ఓంకారం, గుంటా గంగాధర్, పిచుక రవి, సుంకర సురేష్ తదితరులుపాల్గొన్నారు.

● పవన్ కల్యాణ్‌కు హాని తలపెట్టాలని చూస్తే సహించేది లేదని అఖిల భారత కాపు సమాఖ్య ఉమ్మడి కృష్ణాజిల్లా అధ్యక్షుడు పచ్చిపాల రాజా అన్నారు. అఖిల భారత కాపు సమాఖ్య ఆధ్వర్యంలో స్థానిక రాయల్ ఏసీ కల్యాణ మండపంలో నిర్వహించిన సమావేశంలో తెలుగు యువత జిల్లా ఉపాధ్యక్షుడు ఏనుగ జయప్రకాష్, రెడ్నం శ్రీనివాస్, బాయిశెట్టి సుధీర్, మేదంద్రావు మూర్తి, బోయిన నాగరాజు, పులి శ్రీనివాసరావు, చెన్న నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

రైల్వే అండర్ పాస్‌లో నిలిచిపోయిన మురుగు

హనుమాన్‌జంక్షన్, జూలై 20 : అధికారుల నిర్లక్ష్యానికి మండలంలోని కోడూరుపాడు రైల్వే అండర్ పాస్ మార్గం వద్ద గ్రామ ప్రజలకు సమస్య ఎదురైంది. గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి అండర్ పాస్‌లో నీరు నిలిచిపోవడంతో గ్రామస్థులకు రాకపోకలకు ఇబ్బందిగా మారింది. అండర్‌పాస్ వద్ద వర్షాకాలంలో నిలిచిన మురుగునీటి బయటికి పంపించే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడంలో అధికారులు నిర్లక్ష్యం వహించడంతో గత రెండు రోజులుగా గ్రామస్థులు మురుగు నీటిలోనే రాకపోకలు సాగించాల్సిన దుస్థితి ఎదురైంది. అండర్ పాస్ వద్ద ప్రజలు పడుతున్న ఇబ్బందిని శనివారం గ్రామ మాజీ సర్పంచ్ గరిక పాటి రామకృష్ణ రైల్వే అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను సత్వరమే శాశ్వతంగా పరిష్కరించాలని కోరినట్లు తెలిపారు.



4.6 సెం.మీ వర్షపాతం నమోదు ..

రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలు కారణంగా మండలంలో 4.6 సెం.మీ వర్షపాతం నమోదు అయ్యింది. గ్రామాల్లో మురుగు నీరు నిలిచిపోయే పరిస్థితి ఎదురవ్వడంతో గ్రామాల్లో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు నివారణ చర్యలు చేపట్టారు.

వర్షం నీటిని తొలగించాలి



కంకిపాడు ఫ్లైఓవర్ వద్ద రోడ్డుపై నిలిచిన వర్షం నీటిలో నిలుచుని నిరసన వ్యక్తం చేస్తున్న గ్రామస్థులు

కంకిపాడు : కంకిపాడు - గన్నవరం రోడ్డులోని ఫ్లై ఓవర్ వద్ద రోడ్డుపై నిలిచిన వర్షపు నీటితో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రెండు రోజులుగా కురిసిన వర్షాల కారణంగా గన్నవరం రోడ్డులోని గుంతల వద్ద కంకిపాడు, పునాదిపాడు గ్రామస్థులు నిరసన వ్యక్తం చేశారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఐదేళ్ల పాటు అధికార పార్టీ నాయకులు రోడ్లు అభివృద్ధి చేయకుండా చోద్యం చూశారని ఆవేదన వ్యక్తం చేశారు.

మునిగిన వరిపొలాల పరిశీలన

పెనమలూరు : మండలంలో మునిగిన వరి పొలాలను ఏవో శైలజ శనివారం పరిశీలించారు. 14హెక్టార్లలో వరి నారుమళ్లు నీట మునిగాయని, 179 హెక్టార్లలో వరిచేలు నీటమునిగాయని పేర్కొన్నారు. కాల్వల ద్వారా నీటిని బయటికి పంపుకోవాలని సూచించారు.

గన్నవరం : మండలంలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా పలు గ్రామాల్లో వ్యవసాయ శాఖ అధికారులు శనివారం పర్యటించారు. బుద్ధవరంలో ఇన్‌చార్జి ఏవో ఎన్ఎల్ తేజశ్విని పలు పొలాలను పరిశీలించారు. వరి నారుమడులు, వెదజల్లిన పొలాల్లో తీసుకోవాలసిన జాగ్రత్తలను రైతులకు తెలిపారు. ఎక్కువగా నీరు ఉన్న పొలంలో రెండు మీటర్లు ఒక కాలిబాట తీసి నీరు బయటకు వెళ్లే లాగా చూడాలన్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	118, 127, 138
చికెన్ విత్ స్కిన్	224
చికెన్ స్కిన్‌లెస్	234

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ.5.30



రక్తదానంతో ప్రాణదాతలు కండి

కోడూరు : ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని లెజెండ్ సోషల్ సర్వీస్ అధినేత పూతబోయిన అయ్యప్ప స్వామి కోరారు. కోడూరు రామకృష్ణ థియేటర్ ప్రాంగణంలో శనివారం మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఫెర్టిలైజర్స్ అండ్ పెస్టిసైడ్స్ సంఘం అధ్యక్షుడు పూతబోయిన రామారావు ప్రారంభించారు. ప్రభుత్వ ఆసుపత్రి బ్లడ్ బ్యాంక్ ప్రతినిధులు రక్త నమూనాలను సేకరించారు. స్వచ్ఛందంగా 86 మంది రక్తదానం చేశారు. యోగానంద్, లెజెండ్ సోషల్ సర్వీస్ టీం సభ్యులు పాల్గొన్నారు.

ఎంపీడీవో ఫోన్ కాల్స్‌పై దృష్టి

» ఇంకా దొరకని ఆచూకీ.. కొనసాగుతున్న గాలింపు

నరసాపురం రూరల్ : ఎంపీడీవో వెంకటరమణ అదృశ్యంపై ఇంకా సస్పెన్స్ కొనసాగుతూనే ఉంది. ఆరో రోజు కూడా ఆయన ఆచూకీ చిక్కలేదు. అదృశ్యానికి ముందు ఎంపీడీవోకు వచ్చిన ఫోన్ కాల్స్‌పై దృష్టి పెట్టారు. మండల పరిషత్ కార్యాలయంలో రేవుకు సంబంధించిన కొన్ని రికార్డులను ఊయ్యూరు పోలీసులు స్వాధీనం చేసుకుని రేవు లావాదేవీలను అన్ని కోణాల్లోనూ విచారిస్తున్నారు. తరచూ ఎంపీడీవోకు బెదిరింపు ఫోన్ కాల్స్ వచ్చేవని, అవి వచ్చినప్పుడల్లా భయాందోళన చెంది సిబ్బంది పని చేసే చోటే కూర్చొనేవారని, ఒకసారి అప్పు చేసి పెద్ద మొత్తంలో నగదు పంపాడనే సమాచారంతో పోలీసులు ఆ దిశగా దర్యాప్తు చేస్తున్నారు. ఎంపీడీవోను బెదిరించి ఎందుకు డబ్బులు గుంజుకుంటున్నారనే అనే కోణంలో విచారణ చేస్తున్నారు. ఫోన్ కాల్స్ అన్నీ ఇతర రాష్ట్రాలకు చెందినవిగా గుర్తించి వివరాలను సేకరించే పనుల్లో నిమగ్నమయ్యారు. వీరికి, పాటదారుడు రెడ్డప్ప ధవేజీకి ఏమైనా సంబంధం ఉందా? అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.

పది రోజుల్లో టిడ్కో కాలనీ సమస్యల పరిష్కారం

గుడివాడ : పది రోజుల్లో టిడ్కో కాలనీ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. టిడ్కో కాలనీ ప్రజల సమస్యలపై మున్సిపల్, టిడ్కో అధికారులు, కాంట్రాక్టు సంస్థల ప్రతినిధులతో శనివారం మున్సిపల్ ప్రత్యేకాధికారి చాంబర్‌లో సమావేశం నిర్వహించారు. అభివృద్ధి పనులు, తాగునీటి పథకం మరమ్మత్తులను కాంట్రాక్టు సంస్థలు పూర్తి చేసి పది రోజుల్లోగా పురపాలక సంఘానికి అప్పగించాలన్నారు. శిథిలావస్థకు చేరిన పురపాలక సంఘ వాణిజ్య భవనాలను తొలగించి, వాటిని ఆరునెలల్లో పునర్నిర్మించి లీజుదారులకే తిరిగి అప్పగిస్తామని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. మున్సిపల్ అధికారులు, మున్సిపల్ దుకాణాల లీజుదారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రజల మంచి కోరుతూ కొన్ని కఠిన నిర్ణయాలు తీసుకోవాల్సిన ఆవశ్యకత ఎంతో ఉందన్నారు. మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, మున్సిపల్ మాజీ ఛైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, అసిస్టెంట్ కమిషనర్ కృష్ణారావు, డీఈ ప్రవీణ్, టిడ్కో ఎస్ఈ చిన్నోడు, డీఈ శాంత కుమార్, ఏఈ సురేష్‌బాబు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ధ్యేయం : ఎమ్మెల్యే కాగిత

కృత్తివెన్ను : రైతుల అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తుందని ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. కొమాళ్లపూడి శ్రీకృష్ణ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో వడ్డీ రాయితీ చెక్కులను రైతులకు అందజేశారు. శీతనపల్లిలోని మెగా రక్షిత మంచినీటి పథకాన్ని పరిశీలించారు. గురుపౌర్ణమి సందర్భంగా సాయిబాబా గుడి వద్ద అన్నసమారాధనలో పాల్గొన్నారు. ఒడుగు తులసీరావు, పిన్నెంటి రత్తయ్య, నెక్కంటి భాస్కరరావు, కూనసాని చిన్న, యాదం రెడ్డికొండ, కూనసాని శ్రీనివాసరావు, నాగిడి చెన్నకేశవరావు, అధికారి శ్రీనివాసరావు, పాశం నాగమల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు మాజీ ఎంపీ కొనకళ్ల పరామర్శ

ఘంటసాల : మండలంలోని బాధిత కుటుంబాలను మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణరావు శనివారం పరామర్శించారు. లంకపల్లిలో మరణించిన వీరమాచినేని అంకినీడు దుర్గా ప్రసాద్ కుటుంబ సభ్యులు నాని, చిన్నాలను, గువ్వాబత్తిన అనసూర్య కుమారుడు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు గువ్వాబత్తిన నాగేశ్వరరావు, సాయి కుటుంబసభ్యులను, పరిశె వీరుళ్ల కుమారుడు పరిశె శ్రీనివాసరావులను కొనకళ్ల నారాయణరావు పరామర్శించారు. దిరిశం వెంకట్రావు, కొమ్మారెడ్డి లీలాకృష్ణ, యార్లగడ్డ కిరణ్, పెనుమాక సుదర్శన రావు, ఉంద్రకొండ రవితేజ, పెనుమాక శ్రీనివాసరావు, కొల్లూరి సాయి, కనుమూరి రామకృష్ణ, గువ్వా బత్తిన బాలకృష్ణ, కొప్పుల గోపి, అంకం బాలాజీ, హరి పాల్గొన్నారు.

కవి సూర్యనారాయణకు ఘన సత్కారం



మోపిదేవి : దివిసీమకు చెందిన సీనియర్ పాత్రికేయుడు, ప్రముఖ కవి జి.సూర్యనారాయణను మోపిదేవిలో పురప్రముఖులు శనివారం ఘనంగా సన్మానించారు. ప్రముఖ యూట్యూబ్ చానల్ నిర్వహించిన కవితల పోటీల్లో సూర్యనారాయణ రాష్ట్రస్థాయిలో ద్వితీయ స్థానం సాధించి నగదు బహుమతి గెలుపొందారు. ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సూర్యనారాయణను చల్లపల్లి ఎస్టేట్ దేవాలయాల కార్యనిర్వహణాధికారి ఎన్.సూర్యచక్రధరరావు ఘనంగా సత్కరించి జ్ఞాపిక అందజేశారు. ఆయా మండలాల పాత్రికేయులు, టీడీపీ, జనసేన నాయకులు, పురప్రముఖులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నివారిద్దాం - క్యాన్సర్‌ను రూపుమాపుదాం

అవనిగడ్డ : ప్లాస్టిక్ వినియోగాన్ని నిరోధించి, క్యాన్సర్ మహమ్మారిని రూపుమాపుదామని చైల్డ్ హుడ్ సేవా సంస్థ కార్యదర్శి లీలా కృష్ణ అన్నారు. స్వచ్ఛంద సేవా సంస్థ కార్యాలయంలో ప్లాస్టిక్ నివారిద్దాం..ప్రాణాంతక వ్యాధుల నుంచి కాపాడుకుందాం వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. టీ స్టాల్స్‌లో గాజు గ్లాసులను వినియోగించేలా చైల్డ్ హుడ్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఉచితంగా పంపిణీ చేపట్టనున్నట్లు తెలిపారు. చైల్డ్‌హుడ్ సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ సభ్యులు అన్నపరెడ్డి కృష్ణ, యాసం శోభన్ బాబు, బండే శ్రీను, దామెర్ల రాజా, మోపిదేవి శ్రీను, చింతలపూడి శేఖర్, హనుమంతు శ్రీను, చిన్నారి లోస్యశ్రీ, బండ్రెడ్డి శ్రీను, చందు శ్రీను పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో నేత్రపరీక్షలు

చల్లపల్లి : చల్లపల్లి లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో లయన్స్ మల్టీపర్పస్ సర్వీస్ సెంటరులో శనివారం ఉచిత నేత్రపరీక్షా శిబిరం నిర్వహించారు. చల్లపల్లి లయన్స్ క్లబ్ సర్వీస్ ఛైర్‌పర్సన్ కొల్లిపర మధు సతీమణి పార్వతి జ్ఞాపకార్థం ఈ శిబిరాన్ని నిర్వహించారు. డాక్టర్ వెంకట్రావు 40 మందిని పరీక్షించి 11 మందిని ఐవోఎల్ ఆపరేషన్లకు ఎంపిక చేసి గూడూరు నేత్రాలయానికి పంపారు. రాయపాటి రాధాకృష్ణ, నర్రా సాయిబాబు, కొల్లిపర మధు, మోపిదేవి వెంకటేశ్వరరావు, ఎం.వి.కృష్ణారావు పర్యవేక్షించారు.



దెబ్బతిన్న నారుమడులను పరిశీలిస్తున్న నారాయణరావు



బంటుమిల్లిలో పొలాలను పరిశీలిస్తున్న రైతు సంఘం నాయకులు



లింగవరంలో పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు



మోపర్రులో పొలాలను పరిశీలిస్తున్న కుమార్‌రాజా

ముంపు కష్టాలు

● నీటమునిగిన నారుమళ్లు, వరి చేలు ● ఎమ్మెల్యే, అధికారుల పరిశీలన

కూచిపూడి, జూలై 20 : డ్రెయిన్లలో గుర్రపు డెక్కను తొలగించకపోవటంతో విస్తారంగా కురుస్తున్న వర్షాల కారణంగా డ్రెయిన్లు పొంగిపొర్లుతున్నాయి. ఆవిరిపూడి, మొవ్వ, కూచిపూడి, కారకంపాడు, నిడుమోలు, కాజ తదితర గ్రామాల్లో వరి నారుమడులు నీటమునిగాయి. ఐనంపూడి, గేదెలకోడు, భీమనది డ్రైన్లు పేరుకుపోయిన తూటుకాడను వేసవిలో తొలగించకపోవటం, పంట కాలువలు మరమ్మతులకు నోచుకోని కారణంగా రైతులు ఇబ్బందులు పడుతున్నారు. నారుమడులతోపాటు ఇటీవల వేసిన నాట్లు కూడా నీటమునిగిపోయి రైతులకు నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం పూర్తిస్థాయి సబ్సిడీతో వరి విత్తనాలు అందించాలని జిల్లా కౌలు రైతు సంఘ ఉపాధ్యక్షులు శీలం నారాయణరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నీటమునిగిన పంట పొలాలు, నారుమడులు పరిశీలించారు. **బంటుమిల్లి :** మల్లేశ్వరం తదితర ప్రాంతాల్లో నీటి మునిగిన పంట పొలాలను రైతు సంఘం నాయకులు శనివారం పరిశీలించారు. దాదాపు 150 ఎకరాల పంట నీట మునిగింది. డ్రెయినేజీలో అవరోధాలు తొలగించి రైతులు నష్టపోకుండా ఆదుకోవాలని రైతు సంఘం నాయకులు గౌరిశెట్టి నాగేశ్వరరావు, అజయ్‌ఘోష్, మాజేటి శివశ్రీనివాస రావు, జన్యావుల కన్నారావు, జొన్నలగడ్డ ఆంజనేయులు, కుంతేటి తాతయ్య రాంబాబు తదితరులు కోరారు.

గుడివాడ మండలంలో..

గుడివాడ రూరల్ : గుడివాడ రూరల్ మండలం లింగవరం గ్రామంలో డ్రెయిన్ పూడుకుపోవటంతో గుర్రపు డెక్క, తూడు, నాచు ఉండి కిందకు నీళ్లు పారకపోవటంతో లింగవరం కాలనీ వాసులు, టీడీపీ నాయకులు కాటూరి ఏసుపాదం ఆధ్వర్యంలో శనివారం గుర్రపు డెక్కను తొలగించారు. గుడివాడ వ్యవసాయ సహాయ సంచాలకులు నిమ్మగడ్డ రమాదేవి, మండల వ్యవసాయాధికారి బోలెం అనంతలక్ష్మి, లింగవరం, మెరకగూడెం గ్రామాల్లో నారుమళ్లను, నాట్లను పరిశీలించి రైతులకు సూచనలు చేశారు. **పెదపారుపూడి :** మోపర్రులో నీటి మునిగిన పంట పొలాలను ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా పరిశీలించారు. ఏటా ముంపు బారిన పడి పంట చేతికి దక్కటం లేదని రైతులు తెలిపారు. కాల్వల పూడికతీత చేపట్టకపోవడంతో తొలకరి వానకి వరి నారుమళ్లు, నాట్లు ముంపునకు గురయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. మనుషులను పెట్టి తూటుకాడ, కిక్కిరస తీసి మురుగు సాఫీగా సాగే విధంగా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే కుమార్ రాజా హామీ ఇచ్చారు.

జలదిగ్బంధంలో ప్రభుత్వ కార్యాలయాలు

మచిలీపట్నం టౌన్ : భారీ వర్షంతో జిల్లా కేంద్రం మచిలీపట్నంలో ప్రభుత్వ కార్యాలయాలు జలదిగ్బంధంలో ఉన్నాయి. ఆర్డీవో కార్యాలయ ప్రాంగణం, డీఈవో కార్యాలయానికి వెళ్లే రోడ్డు ముంపునకు గురయ్యాయి. మురికివాడలు జలమయమయ్యాయి. బస్టాండ్ ముంపునకు గురయింది. మోటార్లతో నీటిని కమిషనర్ బాపిరాజు తోడిస్తున్నారు. చిన్నం శివ, పి.వి. ఫణికుమార్ ముంపు ప్రాంతాలను సందర్శించారు.

రైతులపై పంచాయతీ కార్యదర్శి పోలీసులకు ఫిర్యాదు

● వెనిగండ్ల, రావి చొరవతో వెనక్కి

గుడివాడ : రైతులపై చర్యలు తీసుకోవాలంటూ పంచాయతీ కార్యదర్శి పోలీసులకు ఫిర్యాదు చేయడం సంచలనం రేకెత్తించింది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు మల్లాయిపాలెం పరిధిలో సుమారు 300 ఎకరాల్లో పంటపొలాల్లో నీరు చేరింది. దీంతో రైతులు మోటూరు అడ్డ రోడ్డు వద్ద కాలువ లో వేసిన అడ్డును తొలగించారు. మురుగు నీరు పం చాయతీ చెరువులో చేరకుండా డ్రాప్‌ను మూసి వేశారు. దీంతో పంచాయతీ చెరువు నింపకుండా రైతులు అడ్డుకున్నారని, అడ్డుకట్ట తొలగించడంతో మురుగునీరు చెరువులోకి చేరుతున్నందున చర్యలు చేపట్టాలని కోరుతూ మల్లాయిపాలెం పంచాయితీ కార్యదర్శి హరికృష్ణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, మాజీ ఎమ్మెల్యే రావి స్పందించడంతో పంచాయతీ కార్యదర్శి తన ఫిర్యాదు ను వెనక్కు తీసుకున్నారు. రైతుల జోలికి వస్తే సహించేది లేదని, రైతు తన పంట పొలాలను ముంపు నుంచి కాపాడుకునేందుకు డ్రైనేజీ లో అడ్డుకట్టను తొలగిస్తే తప్పేంటని రావి అన్నారు.



శాకంబరిగా పార్వతీ దేవి



కొండాలమ్మ ఆలయంలో శాకంబరి ఉత్సవానికి ఏర్పాట్లు

టేకుపల్లిలో శాకంబరిగా బాల పార్వతీదేవి

మోపిదేవి : లోకకళ్యాణార్థం టేకుపల్లిలో బాలాపార్వతీ సమేత రామేశ్వర స్వామి ఆలయంలో బాలపార్వతీ అమ్మవారికి శనివారం శాకంబరి అలంకరణ వైభవంగా నిర్వహించారు. స్వామివారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అమ్మవార్లకు కుంకుమార్చన చేశారు. ఆలయ స్థానాచార్యులు లంకా ప్రసాద్, అర్చకులు శాస్త్రి నిర్వహణలో అమ్మవారికి వివిధ రకాల పండ్లు, కూరగాయలతో విశేష అలంకరణ గావించారు. భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని పూజలు జరిపారు.

కొండాలమ్మకు శాకంబరి ఉత్సవం నేడు

గుడ్లవల్లేరు : వేమవరం కొండాలమ్మ అమ్మ ఆదివారం శాకంబరిగా భక్తులకు దర్శనమివ్వనున్నారని ఈవో కానూరి సురేష్ బాబు తెలిపారు. శనివారం మధ్యాహ్నం నుండే కూరగాయలతో ఆలయ ప్రాంగణాన్ని సుందరంగా అలంకరించారు. మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అలంకరణ సేవ చేశారు.

నేడు గణపేశ్వరం దుర్గమ్మకు..

నాగాయలంక : గణపేశ్వరం దుర్గా గణపేశ్వరస్వామి దేవస్థానంలో ఆషాఢ మాసం సందర్భంగా ఆదివారం తెలుగు మహిళా జిల్లా అధ్యక్షురాలు తలశిల స్వర్ణలత, లేబాక పద్మప్రియ ఆధ్వర్యంలో 108 కేజీల పసుపు, కుంకుమను అమ్మవారికి ఆషాఢ సారెగా సమర్పిస్తారు.

ప్రజాక్షేమం కోరుతూ రవీంద్ర పూజలు

మచిలీపట్నం టౌన్ : ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలని ఆకాంక్షిస్తూ బందరుకోట రామాలయంలో మంత్రి కొల్లు రవీంద్ర శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆషాఢమాసం సందర్భంగా సీతారామచంద్రులను దర్శించుకుని విశేష పూజలు జరిపారు.

ప్రజాదర్బార్ వాయిదా

మచిలీపట్నం టౌన్ : మచిలీపట్నం టీడీపీ కార్యాలయంలో ఆదివారం మంత్రి కొల్లు రవీంద్ర నిర్వహించాల్సిన ప్రజా దర్బార్ భారీ వర్షాల కారణంగా వాయిదా వేసినట్లు నగర టీడీపీ అధ్యక్ష, కార్యదర్శులు ఇలియాస్ పాషా, పిప్పళ్ల కాంతారావు తెలిపారు.

మానవత కార్యవర్గ ప్రమాణస్వీకారం

పెడన : మానవత స్వచ్ఛంద సేవా సంస్థ పెడన శాఖ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం బంగ్లా స్కూల్ ఆవరణలో శనివారం జరిగింది. అధ్యక్షుడిగా మట్టా రాధాకృష్ణమూర్తి, ఉపాధ్యక్షుడిగా ఇర్ఫాన్‌బాషా, కార్యదర్శిగా ఊటుకూరి సుబ్బారావు, సంయుక్త కార్యదర్శిగా ఉమ్మిటి విద్యాధర్, కోశాధికారిగా కాగిత శంకర సాంబశివరావు, కార్యవర్గసభ్యులుగా పేరక రవి, ఖుర్షిద్ బేగం, సిద్దాని సత్యనారాయణ, బెల్లంకొండ లక్ష్మణ్ ప్రమాణ స్వీకారం చేశారు. మానవత స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకులు, కేంద్ర నియంత్రణ కమిటీ ఛైర్మన్ ఎన్.రామచంద్రారెడ్డి, దామోదర్, అనుముకొండగౌరీప్రసాద్, రాజేంద్రప్రసాద్, పెర్నేటి శ్రీరామ్, రామాంజనేయరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మచిలీపట్నం అర్బన్ బ్యాంకు స్పెషలాఫీసర్‌గా రాము

మచిలీపట్నం టౌన్ : మచిలీపట్నం కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు అధ్యక్షుడు పల్లపోతు సుబ్రహ్మణ్యంతో పాటు పాలకవర్గం రాజీనామా చేసినందున బ్యాంకు స్పెషలాఫీసర్‌గా సహకార శాఖకు చెందిన అసిస్టెంట్ రిజిస్ట్రార్ పి. రామును నియమించారు. శనివారం బాధ్యతలు స్వీకరించారు.

గుడివాడ అర్బన్ బ్యాంకు ఇన్‌చార్జ్‌గా విజయ్‌కుమార్

గుడివాడ : ది గుడివాడ కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు పర్సన్ ఇన్‌చార్జ్‌గా సహకార శాఖ అసిస్టెంట్ రిజిస్ట్రార్ డి.విజయ్‌కుమార్ శనివారం బాధ్యతలు చేపట్టారు. అర్బన్ బ్యాంకు అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు.

హెల్మెట్‌తో రక్షణ పొందండి

గుడ్లవల్లేరు : ద్విచక్ర వాహనదారులు హెల్మెట్‌ను ధరించి ప్రాణాలను రక్షించుకోవాలని గుడివాడ రూరల్ సీఐ ఏసుబాబు అన్నారు. గుడ్లవల్లేరు ప్రధాన కూడలిలో శనివారం హెల్మెట్ ధారణపై అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎస్సై సత్యనారాయణ, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

రొయ్యూరులో టీడీపీ విజయోత్సవం

తోట్లవల్లూరు : రొయ్యూరులో శనివారం రాత్రి టీడీపీ విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా ర్యాలీ పాల్గొని ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పించారు. టీడీపీ సీనియర్ నాయకుడు ఉప్పులూరి గోపాలకృష్ణ మనువడు రుత్విక్ చంద్ జన్మదినోత్సవం పాల్గొని ఆశీర్వదించారు. శివరామ్‌ప్రసాద్, రేణుకారావు, వెంకట రమణ పాల్గొన్నారు.

చిరు వ్యాపారులు పౌరులకు ఇబ్బంది కల్గించొద్దు

పామర్రు : రోడ్లపై చిరువ్యాపారాలు చేసుకునే వారు పౌరులకు, పాదచారులుకు ఎలాంటి ఇబ్బందులు కల్పించకుండా నియమాలు పాటించాలని ఎమ్మెల్యే వర్లకుమార్ రాజా అన్నారు. గుడివాడ రోడ్డులోని ప్రధాన వంతెన దిగువ భాగం లో చిరు వ్యాపారాలు సాగిస్తున్న దుకాణాదారులుతో ఎమ్మెల్యే సమావేశయ్యారు. రోడ్డు మార్జిన్లను ఆక్రమించుకుని ప్రజలకు ఇబ్బందులు కల్గించడం సరికాదన్నారు. శ్రీనివాసరావు, మహాదేవా, చాణిక్య, రమేష్ పాల్గొన్నారు